కట్టుబానిసత్వంలో ఇటుక బట్టీల కార్మికులు

పెట్టుబడిదారీ నయా ఉదారవాద విధానాల ఫలితంగా వర్ధిల్లుతున్న నిర్మాణరంగ పరిశ్రమకు అవసరమైన, ప్రధానమైన యిటుకల తయారీరంగంలో కార్మికులను కట్టుబానిసలుగా బంధించి వారిచేత ఏళ్ళ తరబడి వెట్టిచాకిరీని బలవంతంగా చేయించుకొంటూ వారి శ్రమశక్తిని దారుణంగా దోచుకోవటమన్నది, ఒక మామూలు విషయంగా పరిపాటయిపోయింది.

తెలంగాణా, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో యీ రకమయిన కట్టుబానిస – వెట్టిచాకిరీ విధానం కొనసాగుతూ వుండటమన్నది మన వ్యవస్థ యొక్క అర్ధఫ్యూడల్ స్వభావానికి అద్దం పడుతోంది.

ఇటీవల కాలంలో, ఒరిస్సాకి చెందిన 329 మంది వెట్టికార్మికుల 'విడుదల' ఉదంతం, యీ వెట్టి కార్మికవ్యవస్థ వ్రేళ్ళ వరకు పాతుకుపోయిన స్థితిని బట్టబయలు చేసింది. 2016 మే 29న చెన్నైకి సమీపాన గల తిరువళ్ళువార్ జిల్లాలో 'విడుదల' చేయబడిన వెట్టి కార్మికులందరూ జి.డి.ఎం అనబడే యిటుక బట్టీలో బలవంతంగా కట్టుబానిసలుగా పనిచేయించుకోబడుతున్నవారే. వీరంతా ఒరిస్సాలోని బార్గా, బొలంగీర్, నబ్రానాగపూర్, నేపదా, కలహండీ జిల్లాలకు చెందిన పేద కుటుంబాలవారు. వీరు 2015 డిసెంబరులో యిక్కడకు తీసుకురాబడ్డారు. వీళ్ళను తమ గ్రామాల నుండి కొంత మొత్తాలు అడ్వాన్సుగా యిచ్చి ఎక్కువజీతం (రోజుకు రూ.360/– దాకా) యితర సౌకర్యాలు కల్పిస్తామని నమ్మబలికే ఏజెంటు తీసుకువచ్చి, యీ యిటుక బట్టీలో వెట్టి కార్మికులుగా కట్టిపడవేశాడు. ఈ 333 మందిలో 127 మంది స్త్రీలు, 88 మంది బాలలు. వీరందరూ రోజుకు 14 గంటలపాటు విశ్రాంతి లేకుండా నిర్బంధంగా పనిచేయాలి. వీరికి కనీస వసతులు కల్పించబడని డేరాలలో / చుట్టు గుడిసెల్లో యిటుక బట్టీకి చేరువనే కాపురముండి పనిచేయాలి.

దేశంలో వెట్టిచాకిరీ నిర్మూలన కోసం, కార్మికుల అక్రమ రవాణాను నిషేధిస్తూ చట్టాలు ఎన్ని వున్నా, అవి ఎన్నడూ అమలుజరపబడవు. ఇటుకబట్టీ యజమానులు రాజకీయ ప్రాబల్యం, పలుకుబడీ, పెత్తందారీతనం కలవారు కావటం వలన చట్టాలను అమలు జరపాల్సిన యంత్రాంగం, వెట్టిచాకిరీలో కార్మికులు నిర్బంధించబడ్డారని తెల్సినా వీరివేపు కన్నెత్తి కూడా చూడదు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వీరిని పట్టించుకొని కేసులు పెట్టాల్సి వచ్చినా, వారు వెంటనే తప్పించుకొనే అవకాశాలు ఆయా చట్టాల్లో కోకొల్లలుగా వున్నాయి.

ఉదాహరణకు ప్రస్తుతం 329 మంది వెట్టి కార్మికులను 'విముక్తి' చేసిన తిరువళ్ళువార్ జిల్లాలోని జి.డి.ఆర్. యాజమాన్యానికి చెందిన యిటుక బట్టీలోనే, 2015 ఫిబ్రవరిలో 333 మంది వెట్టికార్మికులను రెవిన్యూ అధికారులు 'విముక్తి' చేశారు. యజమాని (స్వంతదారుడు) మున్నుస్వామిని అరెస్టుచేసి ఆనక బెయిల్ మీద విడుదల చేశారు. తిరిగి యథాప్రకారం అతడు వెట్టి కార్మికుల శ్రమదోపిడీని మరింత ఉత్సాహంతో కొనసాగిస్తున్నాడు.

ఆదిలాబాద్ జిల్లాలోని యిటుక బట్టీల్లో కట్టుబానిసలుగా నిర్బంధింపబడి, వెట్టిచాకిరీ చేస్తున్న అనేకమంది ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలకు చెందిన కార్మికుల అమానవీయ కథలు ఎన్నో వెలుగులోకి వస్తూనే వున్నాయి. ఆఖరికి తనకివ్వాల్సిన వేతనాన్ని యిమ్మన్నందుకు యిద్దరు కార్మికుల చేతులు తెగనరికిన ఉదంతం కూడా వెలుగులోకి వచ్చింది. అయినా యీ వెట్టిచాకిరీ విధానం – యిటుక బట్టీల్లో నిరాఘాటంగానే సాగిపోతోంది.

థాంప్సన్ రాయిటర్స్ ఫౌండేషన్‌కు చెందిన రీనాచంద్ర ప్రకారం మహారాష్ట్రలో కూడా ఈ అమానవీయ దారుణ వెట్టిచాకిరీ విధానం యిటుక బట్టీలలో నిరాఘాటంగా కొనసాగుతూనే వుంది. భూమిలేని నిరుపేదలైన ఆదివాసీలను యిటుకబట్టీల్లో కట్టుబానిసలుగా, తమ అప్పు తీరేదాకా, అర్ద సంవత్సరంపాటు నిర్బంధంగా పనిచేయించు కొంటున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారుల ప్రకారమే మహారాష్ట్రలో నిర్మాణ రంగంలో అనేకమయిన చట్టవ్యతిరేక యిటుక బట్టీలు నిర్వహింపబడుతున్నాయి.

రోజుకు 14 గంటలపాటు, నామమాత్రపు వేతనంపైననో అసలు వేతనం లేకుండానో పని చేయించుకోవటం అన్నది యిక్కడ సాగిపోతోంది.

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ అంచనాల ప్రకారం మనదేశంలో కనీసం 10 మిలియన్ల మంది కార్మికులు, టౌన్లు, పట్టణాల శివార్లలో వున్న యిటుక బట్టీల్లో కట్టుబానిసలుగా పనిచేస్తున్నారు. ఈ వెట్టి కార్మికులను కొట్టడం, తిట్టడం అన్నది ఒక మామూలైన విషయంగా వుంది.

కేవలం స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు కలుగ జేసుకొని ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే, యీ వెట్టి కార్మిక నిర్మూలన కోసం ఉద్దేశింపబడిన యంత్రాంగాలు కదిలి తూతూ మంత్రంగా వెట్టి కార్మికులకు 'విముక్తి' కల్పించటం జరుగుతోంది. తర్వాత తిరిగి యధాస్థితిలో వెట్టి కార్మికవ్యవస్థ నిర్వహించబడుతూ, యధాతథంగా కొనసాగించబడుతూనే వుంది.

నిర్మాణరంగంలో అత్యధిక లాభాలను పండించుకొనే విభాగంగా యీ ఇటుకబట్టీల వ్యాపారం స్థిరపడిపోయింది.

భారతదేశపు అర్ధఫ్యూడల్ వ్యవస్థ యొక్క ఆచరణలను కూలదోయకుండానే, ఆ అమానవీయ విధానాలలో ఎట్టి మార్పులేకుండా వున్న పునాదుల మీదనే నూతన నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు తమ యొక్క దోపిడీని కొనసాగించు కొంటున్నాయని (సామ్రాజ్యవాద ఆర్థికదోపిడీ) నిర్ధారించటానికి యింతకు మించిన ఉదాహరణ మరోటి అవసరం లేదు.

ఆస్ట్రేలియాకు చెందిన వాక్ ఫ్రీ ఫౌండేషన్ తన యొక్క గ్లోబల్ స్లేవరీ ఇండెక్స్ (ప్రపంచమంతటి బానిసవిధాన సూచికలో) వెల్లడించినది, యీ విషయాలనే! కార్మికవర్గ ఉద్యమ శ్రేయోభిలాషు లందరూ యీ కట్టుబానిస వ్యవస్థ – వెట్టిచాకిరీ వ్యవస్థ యొక్క ఉనికి, కొనసాగింపులకు మూలకారణమైన వర్గ రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా అర్ధం చేసుకోవాలి!

oooooo